సాక్షి విశాఖపట్నం

గురువారం । 30 । నవంబర్ । 2023



విశాఖతో అనుబంధం ప్రత్యేకం

విశాఖతో అనుబంధం ఎంతో ప్రత్యేక మని హీరో నాని అన్నారు. హాయ్ నాన్న ప్రీ రిలీజ్ వేడుక బీచ్‌రోడ్‌లో నిర్వహించారు. 8లో



మరింత చేరువగా పథకాలు

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికే బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. 8లో



బీచ్‌లో బాంబుల మోత

డిసెంబర్ 4న నేవీ డే సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డు నిర్వహించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 8లో

న్యూస్‌రీల్

21 ఆటోలు, 2 బస్సులపై కేసులు



ఆటో డ్రైవర్లకు రహదారి భద్యతపై అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖాధికారి

గోపాలపట్నం: స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న ఆటోలపై కేసులు నమోదు చేస్తున్నారు. బుధవారం తగరపువలస, ఆనందపురం, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 21 ఆటోలు, 2 స్కూల్ బస్సుపై కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు నగరంలో పలు చోట్ల చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 151 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. తగరపువలస, ఆనందపురం ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు అధికారులు అవగాహన కల్పించారు. నిబంధనల ప్రకారం రహదారులపై ఆటోలను నడుపుతామని వారి చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమాల్లో మోటారు వాహన తనిఖీ అధికారులు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, రాజారావు, శిరీష, శిరీషాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి అంతర పాలిటెక్నిక్ క్రీడోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వనాథం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ప్రాంతీయ స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గైస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత, ఏపీ వాడో కాయ్ కరాటే సంఘం చైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎస్.ప్రశాంతకుమారి, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్ , ఏపీ పాలిటెక్నిక్ ఆల్ పీడీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాలిటెక్నిక్ కాలేజీ పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన



మాట్లాడుతున్న సీసీఏపీ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వసంతం-2023 పేరుతో హస్తకళలు, చేనేతల ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ ప్రతినిధులు అమ్మాజీ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రామ్‌నగర్‌లోని గ్రీన్ పార్క్ హోటల్‌లో శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అసోం, మణిపూర్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో సేకరించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ప్రారంభోత్సవం రోజున చేనేత వస్త్రధారణతో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్టు తెలిపారు.

11, 12న కళా ఉత్సవ్ పోటీలు

భీమునిపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-23 పోటీలు డిసెంబర్ 11, 12 తేదీల్లో భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఇందులో పది కళారూపాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక్కో కళారూపానికి ఒక్కో పాఠశాల నుంచి ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే పాల్గొనాలని, గత పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినవారు అనర్హులని తెలిపారు. వివరాలకు 9573573065 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీ

- ప్రతి ఇంటా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై ప్రచారం
- పథకం సమగ్ర వివరాలతో బుక్‌లెట్ల పంపిణీ
- డిసెంబర్ ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహణ
- కార్యాచరణ సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం



మహారాణిపేట: పేదలకు వరంగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ సేవలను ఎలా పొందాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు చేసింది. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆరోగ్య శ్రీ సమాచారాన్ని తెలియజేస్తారు. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకాన్ని వర్తింపజేస్తున్నామని, తద్వారా రాష్ట్రంలో 95 శాతం జనాభాను పథకం పరిధిలోకి తీసుకొచ్చేమనే విషయాన్ని వివరిస్తారు. ఈ పథకానికి సంబంధించిన బ్రోచర్, కరపత్రాలను ఇంటింటికీ అందజేస్తారు.

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 11 మండలాలు ఉన్నాయి. వీటిలో మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీ), ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), 63 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ), ఒక రూరల్ హెల్త్ సెంటర్, 102 సబ్ సెంటర్లు ఉన్నాయి. మొత్తం 607 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా.. వీటిలో 34 గ్రామీణ ప్రాంతాల్లో, 573 జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి. డిసెంబర్ ఒకటి నుంచి 31వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ఆయా సచివాలయాల పరిధిలోని 909 మంది ఆశ కార్యకర్తలు, 542 మంది ఏఎన్‌ఎంలు భాగస్వాములవుతారు. వీరికి వలంటీర్లు సహకారం అందిస్తారు. అనారోగ్యం బారినపడినా, దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై వీరు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య శ్రీ యాప్, సిటిజన్ యాప్(ఆస్పత్రుల వివరాలు) వివరాలు తెలియజేస్తారు. ప్రభుత్వం అందజేసే బుక్‌లెట్‌లో ఆరోగ్యశ్రీ పథకం సేవలను ఎలా పొందాలి? ఏ సేవలు ఉంటాయి? లాంటి అంశాలపై పూర్తి వివరాలు ఉంటాయి.

ఆరోగ్యశ్రీలో 3,257 చికిత్సలు

గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్‌ను పథకంలోకి తెచ్చి.. ఏకంగా 3,257కు పెంచారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ఇందులో చేర్చారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను గణనీయంగా పెంచి హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా ఉచిత వైద్యం అందిస్తున్నారు. తండ్రి కంటే తనయుడు మిన్న అన్న రీతిలో ఆరోగ్యశ్రీకి అత్యంత ప్రాధాన్యమిస్తూ.. రోగుల కోసం ఆసరా పథకాన్ని కూడా అమలు చేస్తున్నారు. ఆసరా కింద చికిత్స అనంతరం రోగికి రోజుకు రూ.225 నుంచి నెలకు గరిష్టంగా రూ.5వేల వరకు చెల్లిస్తున్నారు. రోగి లేదా వారి బంధువుల బ్యాంకు ఖాతాలో ఈ మొత్తం జమ చేస్తున్నారు.

పారదర్శకంగా సేవలు

జిల్లాలో మొత్తం 50 నెట్‌వర్క్ ఆస్పత్రులు, 20 డెంటల్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సేవల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెంచారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన తర్వాత రోగి నుంచి తప్పనిసరిగా అభిప్రాయాన్ని తీసుకుంటున్నారు. ఆస్పత్రిలో చికిత్స ఎలా ఉంది? వైద్యులు మంచి సేవలందించారా? మందులు, ఆహారం ఎలా ఉంది? ఇలాంటి వివరాలతో ఉన్న లెటర్‌పై రోగి అంతా బాగుందని సంతకం పెట్టిన తర్వాతే బిల్లులు అందజేస్తున్నారు. వారం రోజుల తర్వాత సమీపంలోని ఆరోగ్యమిత్ర, ఏఎన్‌ఎం మళ్లీ రోగి ఇంటికి వెళ్లి అతని ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.

అందరికీ వైద్య సేవలే లక్ష్యం



ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించి మరింత అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టాం. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఒక్కో ఇంటి వద్ద 15 నిమిషాల వరకు కేటాయించి.. ఈ పథకం గురించి వివరించాలి. ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్, కరపత్రం అందజేయాలి. ఆరోగ్య శ్రీ సేవలు అందరికీ అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం.

– డాక్టర్ కె.రాజేష్‌కుమార్, జిల్లా సమన్వయకర్త, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

6న జీవీఎంసీ కౌన్సిల్



జీవీఎంసీ నమూనా

18 అజెండా అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు వచ్చే అవకాశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వసభ్య సమావేశం(కౌన్సిల్) డిసెంబర్ 6న నిర్వహించనున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో రూపొందించిన 18 అజెండా అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా..

4.37 ఎకరాల్లో జీవీఎంసీ హెడ్ క్వార్టర్ బిల్డింగ్

మహా విశాఖ నగర సమగ్ర అభివృద్ధి, నగర జనాభా పెరుగుదల, వచ్చే 40, 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముడసర్లోవలోని 4.37 ఎకరాల కార్పొరేషన్ స్థలంలో నూతన ప్రధాన కార్యాలయం నిర్మించాలని జీవీఎంసీ భావించింది. ఇందుకు గత కౌన్సిల్ సమావేశంలో ఆమోద ముద్ర పడింది. గ్రౌండ్+4 అంతస్తుల్లో(సుమారుగా 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం) నిర్మించేందుకు అంచనాలు తయారు చేశారు. ఇప్పటికే కాన్సెప్చువల్ ప్లాన్, డిజైన్స్ రూపొందించారు. ఎస్‌ఎంజీ డిజైన్(హైదరాబాద్) కంపెనీ ప్రతిపాదించిన ప్లాన్‌ను అనుసరించి రూ.99.47 కోట్లు అంచనా వ్యయంతో జీవీఎంసీ నూతన ప్రధాన కార్యాలయం నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదించేందుకు కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలపనున్నారు.

కాంట్రాక్ట్ ప్రాతిపదికన జోనల్ హార్టికల్చర్లు

జీవీఎంసీ పరిధిలో 110.51 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్స్‌ల పర్యవేక్షణ, 34 కిలోమీటర్ల గ్రీన్‌బెల్ట్‌ల పర్యవేక్షణ, 172 పార్కుల పర్యవేక్షణ, అభివృద్ధి దశలో ఉన్న 7 థీమ్ పార్కుల పర్యవేక్షణ, 143 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కాలనీ పార్కుల పర్యవేక్షణ, 57 ట్రాఫిక్ ఐల్యాండ్స్ పర్యవేక్షణ, జీవీఎంసీ పరిధిలో అందుబాటులో ఉన్న 770 పబ్లిక్ ఖాళీ స్థలాలను పార్కులుగా, గ్రీన్‌బెల్ట్‌గా అభివృద్ధి చేయనున్నారు. ఈ నేపథ్యంలో గ్రీనరీ అభివృద్ధి, నిర్వహణకు అందుబాటులో ఉన్న సిబ్బందితో ప్రజలు, పర్యాటకుల సంతృప్తి మేరకు గ్రీనరీ అభివృద్ధికి సాధ్యం కాకపోవడంతో జోన్‌కి ఒక జోనల్ హార్టికల్చర్ అధికారిని నియమించనున్నారు. మొత్తం ఎనిమిది మందిని మూడేళ్ల కాంట్రాక్ట్ పద్ధతిలో నెలకు రూ.25వేలు వేతనంతో తీసుకోనున్నారు.

ఎకో ఫ్రెండ్లీ సాగర్‌నగర్ తాబేలు బీచ్

సాగర్‌నగర్‌కు ఎదురుగా బీచ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న బీచ్ స్థలంలో రూ.15.65 కోట్లతో 'ఎకో ఫ్రెండ్లీ సాగర్‌నగర్ తాబేలు బీచ్' అభివృద్ధికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ సలహాలతో పర్యావరణ అనుకూలమైన సాగర్‌నగర్ తాబేలు బీచ్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. పర్యావరణ అనుకూలమైన బీచ్ టూరిజంను ప్రోత్సహించడానికి, సముద్ర పర్యావరణ జీవితం, ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల గురించి పర్యాటకులకు అవగాహన కల్పించేందుకు ఈ బీచ్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు ప్రభుత్వ ఏజెన్సీ ఏపీయూఐఏఎంఎల్ ప్రాథమిక డిజైన్లు, డ్రాయింగ్ సిద్ధం చేశారు. వీటితో మరికొన్ని అజెండా అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

రేపు స్థాయీ సంఘ సమావేశం

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం డిసెంబర్ 1వ తేదీన స్థాయీ సంఘ చైర్‌పర్సన్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. సభ్యుల ముందుకు 25 అంశాలు చర్చకు రానున్నాయి.

రేపటి నుంచి 'మెగా కంప్లీషన్ డ్రైవ్'

- 60 రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి
- హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ బి.ఎం.దివాన్



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ బి.ఎం.దివాన్

దొండపర్తి: జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేసేందుకు డిసెంబర్ 1 నుంచి జనవరి 30వ తేదీ వరకు 60 రోజుల పాటు ప్రత్యేకంగా 'మెగా కంప్లీషన్ డ్రైవ్' చేపట్టాలని హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ బి.ఎం.దివాన్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి తీరుపై హౌసింగ్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఈపీడీసీఎల్, నిర్మాణ ఏజెన్సీలు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణలను వేగవంతం చేయాలని చెప్పారు. ఇందుకోసం జరుగుతున్న డ్రైవ్‌లో ఇప్పటికే ప్రారంభించిన ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతాలు తెరవాలని సూచించారు. గృహ నిర్మాణ లక్ష్యాలను మండల, గ్రామ, సచివాలయాలు వారీగా నిర్దేశించారని, గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమినిటీ సెక్రటరీలు రానున్న రెండు నెలలు జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్‌కి ఎటువంటి కొరత లేదని తెలిపారు.

నిర్మాణ ఏజెన్సీలు లక్ష్యాలు సాధించాలి: కలెక్టర్

కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో రెండో దశలో 16, 676 ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నిర్మాణ ఏజెన్సీలు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అవసరమైన లేబర్, సెంట్రింగ్ సామగ్రి, ఇటుకలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. లేకుంటే ఏజెన్సీ కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి జగనన్న లేఅవుట్ కాలనీలో ఆర్చ్‌ను త్వరతగతిని నిర్మించాలన్నారు. లేఅవుట్లలో ప్రత్యేక శ్రద్ధ వహించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫిబ్రవరి మొదటి వారంలో రెండో దశ సామూహిక గృహ ప్రవేశాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ అఖిల, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో 14 డీసీసీబీ బ్రాంచ్‌లు



పీఏసీఎస్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో త్వరలో 14 డీసీసీబీ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు చెప్పారు. నర్సీపట్నంలో రూ.53 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్, ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ నూతన భవన సముదాయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీసీసీబీ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో ప్రతి మండలంలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిలో భాగంగానే ఉమ్మడి జిల్లాలో 14 బ్రాంచ్‌లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని బ్రాంచ్‌ల ద్వారా రుణాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సొంత స్థలం ఉండి పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుకు ఆసక్తి గల వారికి డీసీసీబీ నుంచి రుణాలు మంజూరు చేస్తామన్నారు. డీసీసీబీలో రూ.2,100 కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. నర్సీపట్నం బ్రాంచ్ టర్నోవర్ రూ. 110 కోట్లుగా ఉందన్నారు.

కొరియర్‌లో గంజాయి రవాణా

- గంజాయి నిల్వ చేసిన ఇంటిపై సీపీ రవిశంకర్ పర్యవేక్షణలో దాడులు
- 200 కిలోల గంజాయి స్వాధీనం
- పరారీలో నిందితులు



ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం : టూటౌన్ పరిధి అచ్చియ్యమ్మపేట, జీవీఎంసీ స్కూల్ సమీపంలోని ఓ ఇంటిలో గంజాయి నిల్వలు ఉన్నట్టు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులతో కలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ బుధవారం మధ్యాహ్నం దాడులు చేశారు. అక్కడ రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన 7 బ్యాగుల్లో 99 ప్యాకెట్ల గంజాయిని (200 కేజీలు) స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కలిగి ఉన్న ఇంట్లో ఉన్నవారు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. వారు ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా ఇక్కడ నుంచి ఏడాదిన్నరగా కొరియర్‌లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గంజాయితో పాటు అద్దెకు ఇచ్చిన ఇంటిని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. నగరంలో కొరియర్, పార్సిల్ సంస్థలు తమ వద్దకు వచ్చిన ప్యాకేజీలను తప్పనిసరిగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే ఇతర ప్రాంతాలకు పంపాలని సీపీ తెలిపారు. ఒక వేళ గంజాయి దొరికితే పోలీసులకు తెలియజేయాలన్నారు. పోలీస్ తనిఖీల్లో గంజాయి దొరికితే అటువంటి కొరియర్ సర్వీసెస్‌పై కూడా ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా అద్దెకు ఇళ్లను ఇచ్చినవారు, అద్దెకున్నవారిపై అనుమానం కలిగితే లోకల్ పోలీస్ స్టేషన్‌కుగాని, పోలీస్ వాట్సాప్ నంబర్ 9493336633 లేదా, పోలీస్ హెల్ప్ లైన్ 112కు గాని తెలియజేయాలని కోరారు. గంజాయి రవాణా చేసినా, గంజాయి రవాణా చేసేవారికి సహకరించినా, అటువంటి వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడులో డీసీపీ-1, కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, టాస్క్‌ఫోర్సు ఏసీపీ, ఏసీపీలు, టూటౌన్ సీఐ, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని కుటుంబంలో పెనువిషాదం

- గ్యాస్ ప్రమాద బాధితులు నలుగురూ మృతి
- నాలుగు రోజుల వ్యవధిలోనే కుటుంబం కనుమరుగు
- వాంబేకాలనీలో అలుముకున్న విషాదం
- కాలనీవాసుల చందాలతో అంత్యక్రియలు



తండ్రి బాలరాజుతో పెద్ద కుమారుడు గిరి, చిన్న కుమారుడు కార్తీక్‌తో తల్లి చిన్ని



ప్రమాద సమయంలో ఇంటిలో మంటలు

మధురవాడ/పీఎం పాలెం : ఆనందాల పొదరిల్లు అగ్నికి ఆహుతైపోయింది.. జీవితంపై ఎన్నో ఆశలు.. మరెన్నో కలలతో రెక్కల కష్టంతో ముందుకు సాగుతున్న ఆ కుటుంబం కలలన్నీ అగ్నికీలల్లో బూడిదైపోయాయి.. చేతికి అందొచ్చిన కుమారులను చూసుకుని మురిసిపోతున్న తల్లిదండ్రులను... ఆ తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా వారు హాయిగా శేష జీవితం గడిపితే చూడాలనుకున్న కుమారులపై విధి కన్నెర్ర చేసింది.. ఒకరి వెంట ఒకరుగా వారం రోజుల వ్యవధిలో నలుగురినీ గ్యాస్ ప్రమాదం రూపంలో కబళించింది. బతుకుతెరువు కోసం నగరానికి పొట్ట చేత పట్టుకుని వచ్చిన ఈ కుటుంబం అర్ధంతరంగా కనుమరుగవడంతో మధురవాడ వాంబే కాలనీలో విషాదం నెలకొంది. వారం రోజుల కిందట ఇంటిలో గ్యాస్ లీకై సంభవించిన ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి ఇద్దరు కుమారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికులు, పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...

రెక్కల కష్టంతో జీవనం

విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామానికి చెందిన యామల బాలరాజుకు అదే జిల్లా చింతలవలస సమీపంలోని బెల్లాంకు చెందిన చిన్నితో గతంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు గిరి, కార్తీక్. వారికి మంచి భవిష్యత్ అందించాలన్న ఉద్దేశంతో బతుకుతెరువు కోసం పిల్లలను తీసుకుని విశాఖ నగరానికి వలస వచ్చేశారు. అలా పలుచోట్ల జీవించి 15 ఏళ్ల నుంచి మధురవాడ సమీప వాంబేకాలనీలో బ్లాక్ నంబర్ 27 బీలోని ఎఫ్‌ఎఫ్ 1, 2 ఇళ్లలో అద్దెకి ఉంటున్నారు. భార్య చిన్ని ఇళ్లల్లో పనులు చేస్తుండగా, బాలరాజు కార్పెంటర్. కుమారులు గిరి ఓ కంపెనీ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండగా, కార్తీక్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బాలరాజు, గిరి, కార్తీక్ కొద్ది రోజుల కిందట భవానీ మాల ధరించారు.

గ్యాస్ సిలిండర్ పిన్ బ్లాక్ అవ్వడంతో..

ఈ నెల 24న శుక్రవారం ఉదయం ఎఫ్ఎఫ్ 2 ఇంట్లో భవానీ మాలధారుల కోసం ప్రసాదం తయారు చేస్తున్నారు. ఆ సమయంలో సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో మరో సిలిండర్ అమర్చే క్రమంలో దాని పిన్ లోపలికి వెళ్లిపోయి బ్లాక్ అయిపోయింది. దీంతో బాగా గ్యాస్ లీకయింది. ఆ సమయంలో ఏమీ కనిపించక లైట్ వేయడంతోపాటు గదిలో దీపం కూడా ఉండడంతో... అప్పటికే ఇళ్లంతా వ్యాపించిన గ్యాస్ అంటుకుని అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలను ఆర్పేందుకు కుటుంబ సభ్యులంతా తీవ్రంగా యత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో నలుగురూ మంటల్లో తీవ్రంగా కాలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే 108 సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. మరోవైపు అగ్నిమాపక శకటం మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అలుముకున్న విషాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురూ అగ్ని ప్రమాదంలో కాలిపోయి నాలుగు రోజుల వ్యవధిలోనే మృతి చెందడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చిన్న కుమారుడు కార్తీక్(20) ఆదివారం మరణించాడు. ఆ బాధ నుంచి తేరుకోక ముందే పెద్ద కుమారుడు గిరి (21) మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. అతనికి అంత్యక్రియలు నిర్వహించడం ఆలస్యమవుతుందని మృతదేహాన్ని బుధవారం ఉదయం తీసుకొద్దామని బంధువులు ఆస్పత్రిలోనే ఉంచేశారు. ఇంతలో అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలరాజు (60), అతని భార్య చిన్ని (55) బుధవారం వేకువజామున మరణించారు. మాలధారణలో ఉండగా తండ్రి, ఇద్దరు కుమారులూ చనిపోవడంతో బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కుటుంబంలో అందరూ చనిపోవడంతో తలకొరివి పెట్టే వారు కూడా కరువయ్యారని, ఇలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. నాయకులు ఇచ్చిన డబ్బులతోపాటు స్థానికులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించి పెద్ద మనస్సు చాటుకున్నారు. మృతదేహాలకు వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ నివాళులర్పించారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



నమూనా శిలాఫలకం వద్ద కలెక్టర్ మల్లికార్జున, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి

మహారాణిపేట: క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రూ.7.57 కోట్ల వ్యయంతో పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో నిర్మించనున్న ఎఫ్‌ఎఫ్‌సీ(ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నమూనా శిలాఫలకాన్ని వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. రూ.7.57 కోట్ల వ్యయంతో 1.22 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు ఇప్పటికే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు మంజూరయ్యాయి. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్మించే సంబంధిత ప్రాజెక్టుకు కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూర్చనున్నాయి. కాంప్లెక్స్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని, అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ మల్లికార్జున సంబంధిత అధికారులకు సూచించారు. పరిశ్రమల కేంద్ర జిల్లా జనరల్ మేనేజర్ గణపతి, ఐలా కమిషనర్ జయచంద్ర, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



బీచ్‌లో బాంబుల మోత

• దద్దరిల్లిన సాగరతీరం

ప్రశాంతమైన సాగరతీరంలో అలజడి రేగింది. సామాన్యులను ఉగ్రవాదులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాంబుల వర్షం కురిపించారు. ఈ విషయంపై తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయానికి సమాచారం అందడంతో నేవీ కమాండోలు రంగంలోకి దిగారు. యుద్ధనౌకలు దూసుకొచ్చాయి. స్పీడ్ బోట్లు తీరానికి చేరుకున్నాయి. దీంతో ఉగ్రవాదులకు, నేవీ సిబ్బందికి మధ్య దాడులు, ప్రతి దాడులు జరిగాయి. చివరకు సైన్యం ఉగ్రవాదులను మట్టుబెట్టింది. బందీలుగా ఉన్న సామాన్యులను ప్రాణాలతో రక్షించింది. డిసెంబర్ 4న నేవీ డే జరగనున్న నేపథ్యంలో బుధవారం జరిగిన రిహార్సల్స్ ఇవి. నేవీ హెలికాప్టర్ల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

\- బీచ్‌రోడ్డు



ఉగ్రవాదుల కోసం గాలిస్తున్న నేవీ కమాండర్లు



ఉగ్రవాదులపై దాడి చేస్తున్న నేవీ కమాండర్లు



దూసుకొస్తున్న బోట్లు



పట్టాలు తప్పిన పాసింజర్ రైలు

• ప్రయాణికుల హాహాకారాలు
• రంగంలోకి దిగిన రైల్వే సిబ్బంది
• క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు
• సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఉత్కంఠగా మాక్‌డ్రిల్

గోపాలపట్నం: ప్రయాణికులతో కూడిన రైలు సింహాచలం స్టేషన్ వద్దకు రాగానే బుధవారం పట్టాలు తప్పింది. దీంతో ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. వెంటనే స్పందించిన రైల్వే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో ఆస్పత్రులకు తరలించారు. రైలు బోగీలను కట్ చేసి ప్రయాణికుల్ని బయటకు తీసుకొచ్చారు.

ఇదంతా వాస్తవం అనుకుంటే పొరబడినట్టే..

పాత గోపాలపట్నం రహదారిలో సింహాచలం రైల్వే స్టేషన్ వెనక ట్రాక్‌పై వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు బుధవారం నిర్వహించిన మాక్‌డ్రిల్ ఉత్కంఠభరితంగా సాగింది. రైలు ప్రమాద సమయంలో ఏవిధంగా సహాయక చర్యలు చేపట్టాలో అవగాహన కల్పించారు. పట్టాలపై పడి ఉన్న బోగీలను భారీ క్రేన్ సహాయంతో తొలగించడం వంటి చర్యలు చేపట్టారు. ఈ మాక్‌డ్రిల్‌ను రైల్వే డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. ఏయే విభాగాలు ఏవిధంగా పని చేశాయో అడిగి తెలుసుకున్నారు. ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్‌గుప్త, సిద్ధార్థనాథ్‌ప్రదాన్ పర్యవేక్షణలో ఆర్‌పీఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రైల్వే శాఖకు చెందిన పలు విభాగాలు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించాయి. జీఆర్‌పీ, గోపాలపట్నం పోలీసులు. ప్రైవేటు అంబులెన్సులు సహాయ, సహకారాలు అందించాయి.



సహాయక చర్యలను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్



క్షతగాత్రున్ని, అంబులెన్స్ వద్దకు తరలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



రైలు భోగీ నుంచి క్షతగాత్రుడిని కిందకి దించుతున్న సిబ్బంది

మరింత చేరువగా పథకాలు

వికసిత్ ప్రచార యాత్రలో కలెక్టర్ మల్లికార్జున

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికే గ్రామాల్లో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జిల్లాలో మొట్టమొదట వికసిత్ భారత్ సంకల్పన బస్సుయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న 17 పథకాలపై నాలుగు రూరల్ మండలాల్లో రోజుకు రెండు చొప్పున 79 గ్రామ పంచాయతీలో 40 రోజులు పాటు ప్రచారం ఉంటుందన్నారు. అర్హత ఉండి కేంద్ర పథకాలు పొందలేని వారు ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని తెలిపారు. కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంకల్ప యాత్రపై రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మన సంకల్పం-వికసిత్ భారత్ అని ప్రతిజ్ఞ చేయించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ మల్లికార్జున తిలకించి, ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యక్రమం నోడల్ అధికారి ఎం.పోలినాయుడు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, డీఈవో చంద్రకళ, కేంద్ర అధికారి సబీ మహమ్మద్, తహసీల్దారు లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ లొడగల రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు రొౌతు శ్యామల, నాయకులు బొట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

వైజాగ్‌తో అనుబంధం ఎంతో ప్రత్యేకం

'హాయ్ నాన్న' ప్రీ రిలీజ్ వేడుకల్లో హీరో నాని



వేడుకల్లో హీరో నాని, హీరోయిన్ మృణాల్ ఠాకూర్

బీచ్‌రోడ్డు: వైజాగ్‌తో తనకు ఎంతో మంచి అనుబంధం ఉందని, ఎటువంటి జోనర్ మూవీ చేసినా.. ఇక్కడి ప్రేక్షకులు ఆదరిస్తున్నారని హీరో నాని అన్నారు. బుధవారం బీచ్ రోడ్డులో హాయ్ నాన్న సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాయ్ నాన్న మూవీతోపాటు అనేక పెద్ద సినిమాలు విడుదలవుతున్నాయని, అన్నింటినీ ఆదరించాలని కోరారు. హాయ్ నాన్న సినిమాకు ప్రేక్షకుల గుండెల్లో మంచి స్థానం లభిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ ఆనందభాష్పాలు వస్తాయన్నారు. ఈ సినిమా కోసం అందరం ఎంతో కష్టపడి పనిచేశామని, దానికి తగ్గ ప్రతిఫలం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : ఇంటర్ చదువుతున్న బాలికను వేధిస్తున్న మాధవధారకు చెందిన వారాడ వెంకటనాయుడు (29)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఆశీలుమెట్ట సమీపంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలికను అదే కళాశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్న వారాడ వెంకటనాయుడు(29) వేధిస్తున్నాడు. గత అక్టోబర్‌లో బాలిక ఇన్‌స్టాగామ్‌కు నగ్న చిత్రాలు, వీడియోలు తరచూ పంపించి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. దీంతో కళాశాలలో గొడవలు జరుగుతున్నాయి. బాలిక తల్లి ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద ఎస్‌ఐ కె.శ్రీను కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అదే కళాశాలలో పని చేస్తున్న మరో వ్యక్తిని కూడా ఈ ఘటనపై అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్కూల్ డైరెక్టర్లు వసంతకుమార్, సురేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

దివ్యాంగులకు మనోధైర్యం కల్పిద్దాం..

• ఉపకరణాల పంపిణీకి మరిన్ని క్యాంపులు
• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింక, ఎంపీ జీవీఎల్ నరసింహారావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల అవసరాలు గుర్తింపు క్యాంప్‌ను బుధవారం ఆయన పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే ముందు ఇతర శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఫింఛన్ రాని దివ్యాంగులకు ఫింఛన్ అందించేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కోసం మరిన్ని క్యాంప్‌లు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాంప్‌నకు సుమారు 800 మంది దివ్యాంగులు హాజరయ్యారు. కార్యక్రమంలో వయోవృద్ధులు అండ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, బొడ్డేపల్లి రాము, క్యాంప్ కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ఉప్పాడ అప్పారావు, టి. ప్రదీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, గాదే రోశిరెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, పీకేఎమ్ పాత్రుడు, ఎమ్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడి కాలు కొలతలు తీస్తున్న సిబ్బంది. చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

క్యాస్కేడింగ్ ఎకోసిస్టంతో నైపుణ్యాభివృద్ధి

బీచ్ రోడ్డు: ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీ స్కిల్ క్యాస్కేడింగ్ ఎకోసిస్టమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ తెలిపారు. క్యాస్కేడింగ్ ఎకోసిస్టమ్ వివరాలను ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. క్యాస్కేడింగ్ ఎకోసిస్టమ్ అనేది ఇప్పటికే ఉన్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో లోపాలను పరిష్కరించడానికి రూపొందించిన మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ మోడల్ అన్నారు. భవిష్యత్తు పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంపూర్ణ శిక్షణ అందించడమే లక్ష్యమన్నారు. ఏపీ స్కిల్స్ యూనివర్స్ అనేది రాష్ట్రంలో ఒక స్టాప్ డిజిటల్ పోర్టల్ అన్నారు. వివిధ నైపుణ్యాలలో శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోర్టల్‌లో ఉపాధి కల్పించే వారు కూడా వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌వీ ప్రసాద్, ముత్తూట్ ఫైనాన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, వీల్స్ మార్ట్, జీఎస్‌కే సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలలో మొత్తం 345 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరగనున్నాయని పేర్కొన్నారు. రిలేషన్ షిప్, జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రెనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, అకౌంట్స్, టెలికాలర్, అసిస్టెంట్, రికవరీ, క్లర్కు, బ్రాంచి ఇన్‌చార్జి, తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ ఆప్తామాలజీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం 10 గంటలకు ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.